# కీలకం

రచన:
ఉపద్రష్ట కృష్ణమూర్తి

కృష్ణమూర్తి పెళ్ళాం ఆత్మహత్య చేసుకుందని ఊరంతా అట్టుడికి నట్టుడికి పోతూంది. అతనింటి ముందు చాలామంది జనం మూగారు! లోపలకు వెళ్ళేవాళ్లూ లోపల్నించి వొచ్చేవాళ్ళూ తీర్థ ప్రజలా వున్నారు. అంతా తలో మాటా అంటున్నారు. ఎవరికి తోచినట్టు వాళ్లు వ్యాఖ్యానిస్తున్నారు.

కృష్ణమూర్తి పిచ్చెత్తినట్టు తిరుగుతున్నాడు వీధిలోకి, ఇంట్లోకీని. కంగారు పడుతున్నాడు. మాటల్లో భయం తొణికిసలాడుతూంది.

ప్లీడరుగారు చూడ్డానికొచ్చారు. ఆయన గుమ్మం ఎక్కుతూ "ఏవండి కృష్ణమూర్తిగారూ! ఇదేం ఘోరమండీ? పాపం?" అన్నాడు.

"ఏం చెప్పమన్నారు? తనకేవయినా కష్టసుఖాలుంటే నాతో చెప్పాలి కాని అంతపని చెయ్యడం ఆ మనిషికి తగునాండి? నలుగుర్లోనూ నన్ను రవ్వ బెట్టడానికాండి! ఇదంతా? ఇంతకీ నా ఖర్మవండి?"

"ఏం? మీలో మీకేవయినా పేచీ పూచీ లున్నాయా?"

"అబ్బెబ్బెబ్బే! రావఁ! రావా! ఏ పేచీఁ లేవండి! ఇదుగో పదకొండింటికి మీతో మాట్లాడే [illegible] నేను ఆఫీసు కెళ్ళింది? మూడింటికి తిరిగొచ్చేసరికి ఇలా వుందండి దాని స్థితి! ఇందులో ఏం మాయుందో ఆ భగవంతుడికి తెలియాలి! ప్లీడరుగారూ!" అన్నాడు కృష్ణమూర్తి.

పోలీసువారికి కబురెళ్లింది. ఐదు కబుర్లంపినా పోలీసువారు రాలేదు! వస్తామని మాత్రం కబురంపారన్నాడు కృష్ణమూర్తి. జనం ఇంకా వొచ్చి పడుతూనే వున్నారు.

సాయంత్రం పడింది. ఇంక పోలీసువారి రాక మీద ఆశ వొదులుకొని నలుగురు ప్లీడర్లూ పక్కింటి షావుకారూ ఐదుగురూ పంచాయితీ చేశారు. శవం ఉన్న పొజిషన్‌ను గురించి వాళ్లకి మీమాంస వొచ్చింది.

శవం వంటింట్లో వుంది. వెళ్ళి చూశారు. మోకాళ్లమీద వొంగి నేల కానుకునే కూర్చుని వుంది ఆమె శవం. మెడకి ఓ తాడు వురిపోసి వుంది. రెండు గజాల లోపు ఎత్తున్న ఆ వంటింటి వసారా పంచవైపు తాడు రెండో చివర ఓ వెదురు బొంగుకి ముడివేసుంది. పొజిషన్ చూడగా స్వయంగా వురిపోసుకుని మరణించినట్టు లేదు. కాని పంచాయితీదార్లు ఐదుగురూ కూడా కృష్ణమూర్తికి పరిచయస్తులూ, మొహమాటస్తులూ కావడంచేత ఎందుకతన్ని అల్లరి చెయ్యడం? అనే ఉద్దేశ్యంతో దాన్ని ఆత్మహత్యగా నిర్ణయించి పంచాయితీ పూర్తి చేశారు. శరీరంలో రుగ్మతం వుండడంవల్ల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుం దన్నారు.

రాత్రికి రాత్రి శవాన్ని తీసికెళ్లి తగలేసేశారు. మర్నాడు పొద్దున్న మామూలుగా పోలీసులు వొచ్చారు. వురి పోసుకుందన్న స్థలం, దొడ్డీ, ఇల్లూ, గదులూ, అన్నీ తణిఖీ చేసి, పంచాయితీదార్లు ఇచ్చిన రిపోర్టు నిజమేనని నమ్ముతూ ఆ రిపోర్టు తీసుకుని వెళ్ళిపోయారు.

◆ ◆ ◆

రెండేళ్ళు గుట్టు చప్పుడుగా గడిచిపోయినై. కృష్ణమూర్తి స్నేహితులూ, బంధువులూ, ఆప్తులూ, అధికార్లూ, అంతాకూడా అతణ్ణి రెండో పెళ్ళి చేసుకోమని బలవంతం చేశారు.

"నాకెందుకండీ మళ్ళీను ఏదో ఇలాగే కాలక్షేపం చేసేస్తాను. మళ్లీ ఏదో బెడద పెట్టకండి!" అన్నాడు కృష్ణమూర్తి!

"అట్లా కాదు! నీకింకా ముప్ఫైయేళ్లయినా నిండలేదు! ఇప్పుడే నువ్వు వైరాగ్యంగా వుండడం మంచిది కాదు. దానిఖర్మం దానిది! అనుభవించే యోగ్యత లేక అది చచ్చింది! నువ్వింకా దానికోసం దేవుళ్ళాడతా వెందుకు? చేసుకో!" అన్నారు ఆప్తులు!

ఎందరో ఎన్నోవిధాల బలవంతం చేసినమీదట మళ్ళీ రెండో పెళ్ళి చేసుకున్నాడు కృష్ణమూర్తి. పిల్ల ఈడేరినపిల్ల, ఆర్నెల్లలో కాపరాని

కొచ్చేసింది. అంతా సంతోషించారు, కృష్ణమూర్తి మళ్ళీ సుఖపడుతున్నాడుకదా అని.

♦ ♦ ♦

మూడేళ్ళ తరవాత—

కృష్ణమూర్తి ఇంట్లో భోజనం చేస్తున్నాడు. మధ్యాహ్నం పదకొండున్నరయింది. ఎండ తీక్షణంగా ఉంది. కొంచెం ఘర్షణపడుతున్నారు మొగుడూ పెళ్లాన్నూ.

"అంతే. యిచ్చి తీరాల్సిందే!"

"నే నివ్వను! నే నెందుకివ్వాలి? ఆ పాడుముండకి ఇంట్లోవన్నీ దోచిపెట్టడం చాలక నానగలు కూడా ఇమ్మంటే యెక్కడివ్వగల్ను?"

"ముండన్నావంటే చెంప పగుల్తుంది?"

"ముండ కాదా అది?"

"నువ్వనడానికి వీల్లేదు!"

"నేనుమాత్రం ఇచ్చేదిలేదు. అది ముండయితే నాకేం? నాలుగుపేటల చెయిను తీసికెళ్ళి దానికివ్వడానికి నేనొప్పను!"

"ఇస్తావా? ఇవ్వవా? చివరిసారి అడుగుతున్నాను!"

"నే నివ్వను!"

"చంపుతాను సుమా!"

"ఏమయినాసరే నేనివ్వనండీ?"

"నిష్కారణంగా చచ్చిపోతు!"

బెదిరింపుకు అన్నాడనుకుంది ఆమె.

"ఎందుకు చంపుతారేం?"

"ఇవ్వకపోతేను!"

"నా పుట్టింటివారిచ్చింది నేనెందుకివ్వాలీ మీరు పెట్టినవన్నీ మీరే తీసికెళ్లి దానికి ధారపోశారుగా!"

"అదికూడా ఇట్లాగే మాట్లాడి మాట్లాడి ఓనాడు చచ్చి వూరుకుంది. నీకూ ఆగతే పట్టేటట్లుంది మాడగా! వెర్రికబుర్లు చెప్పక ఇచ్చెయి!"

"ఆవిడ ఖర్మం ఆవిడది! నేను మాత్రం చస్తే ఇవ్వను! ఆ పాడుముండకి!"

"అదిగో! మళ్ళీ ఆ కూతంటున్నావూ?"

"ఏం? అంటాను! లేకపోతే అది పతివ్రతాయేం?"

"చంపమన్నావా? ఇస్తావా?"

"చంపినా ఇవ్వను!"

చెయ్యి కడుక్కుని వచ్చిన కృష్ణమూర్తి అమాంతం పెళ్లాంమీద పడి ఆ నాలుగుపేట్ల బంగారపు చెయిను కోసం పెనుగులాడాడు. ఆమె పెనుగులాడింది. చెయిను చేతికిరాలేదు కృష్ణమూర్తికి

కోపం మితిమీరిపోయి అతను భార్య గొంతు నొక్కి వెయ్యడం మొదలెట్టాడు. గుడ్లు తేలేసి మోకాళ్లమీద కూచుని రెండుచేతులూ జోడించి చంపొద్దని అతణ్ణి దీనంగా ప్రార్థించింది సంజ్ఞగా ఆమె.

కసిగా వున్న కృష్ణమూర్తి చేతుల్లో మరునిమిషానికి ఆమెశవం మాత్రం మిగిలింది. అతనప్పుడు కంగారుగా వరండాలోకి పరుగెత్తి అక్కడ వున్న చాంతాడు తీసుకొచ్చి రెండు పేటలుగా వేసి వంటువసారా పంచవైపు వెదురుబొంగుకి ఓకొస కట్టి, రెండోకొస ఆమె శవం మెళ్లో బిగుతుగా బిగించి, మోకాళ్లమీదకూర్చునివున్న ఆమె శవాన్ని గోడవైపు తిప్పి వుంచి బట్టలు వేసుకుని ఆఫీసు కెళ్లిపోయాడు.

ఈ కీలకం తెలియని జనం అతడి భార్య ఆత్మహత్య చేసుకుందనే నమ్ముతారు.

## పోలిక

ఒకడు:- ఇంద్ర ధనస్సుకీ, పోలీసు కానిస్టేబులుకీ పోలి కేమిటి?

ఇంకొకడు:- ఇంద్ర ధనస్సు వర్షం వెలిసిపోయిన తరువాతా పోలీసు గందరగోళం అణిగిపోయిన తరువాతా కనిపిస్తారు.

## పరిచయం కలుగచెయ్యవలసిన అవసరంలేని సిరా



★

రచయితలు చాలామంది తాము పంపించే రచనలు ప్రకటింపబడతాయా లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతోబాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డర్లు వ్యక్తుల పేర గాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.